క్లుప్తంగా

విజయ్ కుమార్‌కు ఇంగ్లిష్ ఒలింపియాడ్ అవార్డు



తిరుపతిలో డీఎస్పీ శ్రీలత చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న విజయ్‌కుమార్

ఆలమూరు: మూలస్థాన అగ్రహారం గ్రామానికి చెందిన ఇనపకోళ్ల విజయ్ కుమార్‌కు ప్రతిష్టాత్మక నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్ అవార్డు లభించింది. ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో ఇటీవల మన సంస్కృతి అనే అంశంపై ఒలింపియాడ్ పోటీ పరీక్షలు నిర్వహించింది. అందులో ఉత్తమ ప్రతిభను కనబర్చి ప్రథమ స్థానం సాధించిన సతీష్ కుమార్ తిరుపతి డీఎస్పీ ఎం.శ్రీలత చేతుల మీదుగా నగదు బహుమతి పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ప్రస్తుతం విజయ్ కుమార్ సమీపంలోని చెముడులంకలోనున్న శ్రీషిర్డీసాయి విద్యానికేతన్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. విద్యార్థిని డైరెక్టర్ టి.ఉమారాణి, ఉపాధ్యాయుల బృందం అభినందనలు తెలియజేశారు.

బాధితుడికి పరామర్శ



జి.అగ్రహారంలో అగ్నిప్రమాద బాధితుడిని పరామర్శిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు షేక్ నూర్జహాన్ సాహెబ్‌ను జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి పక్కా ఇంటిని నిర్మించి ఇవ్వాలన్నారు. ఆయన వెంట పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎం.ఎం.శెట్టి, ఉందుర్తి నాగాబు, రాయుడు షన్ముఖ్, సూదాబత్తుల రాము, రాయుడు కృష్ణమహేష్ పాల్గొన్నారు.

మామిడికుదురు: మాతృ వియోగంతో బాధపడుతున్న లూటుకుర్రు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ మండల యూత్ విభాగం అధ్యక్షుడు మట్టపర్తి శివను పి.గన్నవరం నియోజకవర్గం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నేతలు తోరం సూర్యభాస్కర్, విత్తనాల శేఖర్, కటకంశెట్టి ఆదిత్య, కాండ్రేగుల బాబి, జక్కంపూడి వాసు, దొమ్మేటి దుర్గారావు, తులా గోపాలకృష్ణ, బుజ్జిబాబు, సూరిబాబు, శ్రీనివాసరావు, గోపాల్ తదితరులు ఉన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ ఎన్నికపై హర్షం

కొత్తపేట: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్ష పదవికి నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియలో మాధవ్ మినహా ఇతరులు ఎవ్వరూ నామినేషన్ వేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైందన్నారు. ఆయనకు అభినందనలు తెలిపారు.

పోలీసులకు నివాళి

ఆలమూరు: స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం మండల వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో యానిమేటర్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎస్సై ఎం.అశోక్, కానిస్టేబుల్ ఎస్.బ్లెస్సన్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో విశేష కృషి చేసిన వారిద్దరూ మృతి బాధకరమన్నారు. ఎస్సై అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సన్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు కొత్తపల్లి ధనలక్ష్మి, ఏపీఎం ఎం.ధనరాజు, సీఏ ఎం.నవీన్‌కుమార్, యానిమేటర్లు, మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడి మృతి

ఆలమూరు: సంధిపూడికి చెందిన అడపా వీర వెంకట సత్యనారాయణ (యేసు)(69) మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో వైద్యుల సూచనల మేరకు తిరిగి స్వగ్రామానికి తీసుకొస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఆయన గ్రామంలో ఆదర్శ రైతుగా, చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. అలాగే గ్రామ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని నిర్మించారు. ఆయనకు భార్య కృష్ణకుమారి, కుమార్తె ఉన్నారు. కుటుంబానికి ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలుసంతాపాన్ని తెలియజేశారు.

స్పీడ్ కంట్రోల్ స్టాపర్ల ఏర్పాటు

రాజోలు: రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు హైవేలపై స్పీడ్ కంట్రోల్ స్టాపర్లు ఏర్పాటు చేస్తున్నామని రాజోలు సీఐ టి.వి.నరేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన రాజోలు సర్కిల్ కార్యాలయం ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్ కంట్రోల్ స్టాపర్లను పరిశీలించారు.

మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం



కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళీమోహన్

- డీఎస్పీ మురళీమోహన్
- విద్యార్థులకు అవగాహన

కొత్తపేట: మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణం అందరి లక్ష్యం కావాలని, అందుకు ప్రతి ఒక్కరూ నడుం కట్టాలని స్థానిక డీఎస్పీ సుంకర మురళీమోహన్ పిలుపునిచ్చారు. డీఎస్పీ మురళీమోహన్ ఆధ్వర్యంలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ సోమవారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శక్తి యాప్, మాదక ద్రవ్యాల నిరోధకం, రహదారి భద్రత తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో డీఎస్పీ మురళీమోహన్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల ప్రవర్తన, నడవడిక, చదువు తదితర అంశాలపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు కూడా అవగాహన ఉండాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా తేలికగా మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, వీరిలో 15 నుంచి 30 సంవత్సరాల వయస్సు వారు ఎక్కువగా ఉంటున్నారన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మీ పరిసరాలలో గంజాయి, మాదక ద్రవ్యాలను ఎవరైనా వినియోగించిన లేదా విక్రయించినా, ఆ సమాచారాన్ని దగ్గరలోని పోలీస్ వారికి గాని, 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకువచ్చిన శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని అన్నారు. ఇది మహిళలకు కష్ట సమయంలో శక్తిగా ఉపయోగపడుతుందని డీఎస్పీ మురళీమోహన్ తెలిపారు. అదేవిధంగా రోడ్డు సేఫ్టీ పాటించి సురక్షితంగా ప్రయాణం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కొత్తపేట ఎస్సై సురేంద్ర, కళాశాల అధ్యాపకులు కే సత్యనారాయణ, డీసీమెచ్ పాపారావు, సీహెచ్ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

యువతులు అవగాహనతో మెలగాలి: డీఎస్పీ మురళీమోహన్

అయినవిల్లి: యువతులు అన్నింటా అవగాహనతో మెలగాలని, మహిళా సంరక్షణ కోసం పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ అన్నారు. సోమవారం అయినవిల్లి క్షణముక్తేశ్వర బీఈడీ కళాశాలలో విద్యార్థినీలకు డీఎస్పీ సుంకర మురళీమోహన్ శక్తి యాప్, డ్రగ్స్, సైబర్ క్రైమ్ వంటి అంశాల పై అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో అయినవిల్లి మండల పరిధిలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్సైలు హరికోటిశాస్త్రి, మహిళా ఎస్సై భవానీ, వివిధ కళాశాలల యాజ్యమాన్యం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ సీపీ చలో అమలాపురం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు బుధవారం అమలాపురంలో జరిగే వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ సమావేశానికి కార్యాకర్తలు భారీగా హాజరు కావాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. సోమవారం మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన జరగబోవు ఈ సమావేశమునకు ముఖ్యఅతిథిగా పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పార్టీ ముఖ్య నేతలు పాల్గొని దిశా నిర్దేశం చేస్తారని సూర్యారావు పేర్కొన్నారు. కూటమి అధికారంలోనికి వచ్చింది గానీ హామీలు అమలు చేయడం లేదని సూర్యారావు అన్నారు. ప్రభుత్వం వైఫల్యాలను ఎండ గట్టేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వివరించారు. సమావేశంలో పార్టీ నాయకులు మంగెన సింహాద్రి, పాటి శివకుమార్, కటకంశెట్టి ఆదిత్య కుమార్, కుసుమ చంద్రశేఖర్, ఈద రవి రెడ్డి, కట్టా శ్రీనివాస్, తాడి సహదేవ్, గుర్రం జాషువ, నేతల నాని, గుర్రం వెంకట నాగరాజు, సోమిశెట్టి మురళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు సంతోషంగా జీవించాలి

- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్
- రావులపాలెంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బండారు

రావులపాలెం: ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆలింకో) సేవలను సద్వినియోగం చేసుకుని సమాజంలో దివ్యాంగులు సకలాంగులుగా జీవించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం రావులపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో దివ్యాంగులకు ఉపకరణాలను జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయం - సాధికారత మంత్రిత్వ శాఖ, వికలాంగుల సాధికారత విభాగం వికలాంగులకు కృత్రిమ పరికరాలు, పునరావాస పంపిణీ ద్వారా ప్రయోజనం చేకూర్చే లక్ష్యంతో పని చేస్తుందన్నారు. గత నవంబర్‌లో ఏడు నియోజకవర్గాల పరిధిలో ఆలింకో సామాజిక న్యాయ సాధికార సంస్థ దివ్యాంగులకు దివ్యాంగత్వాలపై సర్వే నిర్వహించి అవసరమైన ఉపకరణాలను తయారు చేసి పంపిణీ ప్రక్రియలు చేపట్టిందన్నారు. దీనిలో భాగంగా ఇటీవల రామచంద్రపురంలో, ప్రస్తుతం రావులపాలెంలో ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పీ శ్రీకర్, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర నాయకుడు ఆకుల రామకృష్ణ, ఆలింకో ఏడీ సునీత, ప్రతినిధి సాయికుమార్, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ఏవై రాజు, ఎంపీడీవో మహేశ్వరరావు, తహసీల్దార్ ముక్తేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వచ్చిన దివ్యాంగులు, వారి సహాయకులకు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ వారు భోజనం అందించింది. ఈ సంస్థ అందించిన సేవకు కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెలే బండారు అభినందించారు.

స్థానిక సంస్థల అధికారాల్లో రాజకీయ జోక్యం తగదు

- వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం నేత మార్గన
- ఆర్డీఓకు స్థానిక సంస్థల ప్రతినిధులు వినతి



కొత్తపేటలో ఆర్డీఓ శ్రీకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పాల నాగేశ్వరరావు, ఎంపీపీ గంగాధరరావు తదితరులు

కొత్తపేట: స్థానిక సంస్థలు, ప్రజాప్రతినిధుల అధికారాల్లో రాజకీయ జోక్యం తగదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు పాల నాగేశ్వరరావు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. స్థానిక సంస్థలకు సంబంధించి వివిధ అంశాలపై నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షుడు పాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎంపీపీ గంగాధరరావు, నియోజకవర్గ పరిధిలో స్థానిక సంస్థల ప్రతినిధులు సోమవారం కొత్తపేటలో ఆర్డీఓ పీ శ్రీకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేయించాలని కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ చట్టం ప్రకారం ఉపాధి హామీ పనులు గ్రామ పంచాయతీల ద్వారానే జరిపించాలని, కులీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని, సర్పంచులకు తల్లికి వందనం పథకాన్ని తక్షణమే వర్తింపచేయాలి. కేంద్రం విడుదల చేసిన, 15వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన నిధులు 1,150 కోట్లు స్థానిక సంస్థలకు తక్షణమే జమా చేయాలి. ఈ బిల్లులు చెల్లింపుల్లో రాజకీయ జోక్యం నివారించాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 73, 74 సవరణల మేరకు సర్పంచులకు ఉన్న అధికారాలను విధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీఓ ఎం.ఎస్.నెం. 11 ని రద్దు చేసి, గాలిలో ఉన్న 1,350 మంది పంచాయతీ సెక్రటరీలకు పోస్టింగులు ఇచ్చి, 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వ హామీ మేరకు, గ్రామాల్లో పనులు చేస్తున్న ఇంటి పన్నులను స్థానిక సంస్థల ఖాతాల్లో జమ చేయాలని, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీలకు గౌరవ వేతనాల బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాక ప్రసన్న కుమార్, మండల పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్ కుమార్ (జీపీ), సర్పంచ్‌లు సాగి బంగార్రాజు, రెడ్డి చంటి, అంబటి సుబ్బలక్ష్మి, సబ్బితి మోహన్ రావు, దంగేటి నవ్య శ్రీనివాస్, దొమ్మేటి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం రోటరీ క్లబ్‌కు అవార్డులు



అవార్డులతో మలికిపురం రోటరీ క్లబ్ అధ్యక్షులు బత్తుల ఝాన్సీ, సభ్యులు

మలికిపురం: స్థానిక 3020 రోటరీ క్లబ్ ఆరు అవార్డులను దక్కించుకంది. గత సంవత్సరం బాధ్యతలు తీసుకున్న బత్తుల ఝాన్సీబాయి పదవీ కాలంలో చేసిన వివిధ సేవా కార్యక్రమాలకు ఈ అవార్డులు వచ్చినట్టు క్లబ్ సభ్యులు తెలిపారు. రాజమహేంద్రవరంలో సోమవారం జరిగిన డిస్ట్రిక్ అవార్డ్స్ నైట్‌లో డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, రాష్ట్ర సినీ ఫొటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.విశ్వనాథ్ చేతుల మీదుగా రోటరీ విశిష్ట సేవపురస్కార 6 అవార్డులను తీసుకున్నట్టు సభ్యులు తెలిపారు. రాజమండ్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఝాన్సీబాయిని గవర్నర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు గడ్డం ఫిలిప్ రాజు, పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు



సత్యబాబు దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

రాజోలు: అంకితభావంతో ఉద్యోగి సేవలు అందిస్తే జీవితాంతం గుర్తింపు లభిస్తుందని రాజోలు జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు అన్నారు. రాజోలు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ ఉచ్చుల సత్యబాబు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా న్యాయశాఖ ఉద్యోగుల సంఘ నాయకుడు ముప్పర్తి సత్య శ్రీనివాసరావు అధ్యక్షతన సత్యబాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి హిమబిందు మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా సత్యబాబు విధులు నిర్వహించేవారన్నారు. అనంతరం సత్యబాబు దంపతులను న్యాయమూర్తి ఆధ్వర్యంలో కోర్టు ఉద్యోగులు ఘనంగా సత్కరించారు.

విజయ ప్రసాద్‌కు సత్కారం



పదవీ విరమణ పొందిన విజయ ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఎంపీడీఓ తదితరులు

పి.గన్నవరం: విధి నిర్వాహణలో ఉద్యోగులు అందించిన ఉత్తమ సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అన్నారు. పి.గన్నవరం ఎంపీడీఓగా పనిచేస్తున్న కె.విజయ ప్రసాద్ ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈనేపథ్యంలో స్థానిక కోకోనట్ మర్చంట్స్ అసోషియేషన్ కల్యాణ మండపంలో సోమవారం జరిగిన సన్మాన సభకు ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడారు. విజయ ప్రసాద్ గత 40 సంవత్సరాలుగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో వివిధ హోదాల్లో ప్రజలకు ఉత్తమ సేవలు అందించి అందరి మన్ననలను పొందారని ఆమె అన్నారు. ప్రసాద్ దంపతులను అధికారులు, నాయకులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. డీఎల్‌డీఓ రాజేశ్వరరావు, అయినవిల్లి ఎంపీడీఓ సరోవర్, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వర రావు, గిడ్డి ఆనందరావు, వాసంశెట్టి కుమార్, సంసాని పెద్దిరాజు, పితాని చంద్రకళ, బొండాడ నాగమణి, పప్పుల సాయిబాబు, ఆదిమూలం సూరయ్యకాపు, శేరు శ్రీను, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, యడ్ల ఏసు, ఆచంట ఎస్సై వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు తొలగించేందుకు మార్గం ఏర్పాటు చేస్తాం



ఆసుపత్రిలో మురుగునీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ)లో రోజుల తరబడి నిల్వ ఉంటున్న మురుగునీరును గ్రామ పంచాయతీకి డ్రైనేజీకి తరలించే ఏర్పాటు చేస్తానని ఎంపీడీఓ ఏ రాజు అన్నారు. కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ రాజు సోమవారం స్థానిక సీహెచ్‌సీని పరిశీలించారు. ఆస్పత్రులో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వైద్యాధికారులు అభిలాష్, మనుదీప్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నేలపూడి లావణ్య, కార్యదర్శి కె.మోక్షాంజలితో చర్చించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో మురుగునీరు తరలించేందుకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. అలాగే ఆస్పత్రిలో వ్యర్థాలను నిల్వ చేసి ఒకేసారి తరలించే విధంగా చెత్త కుండీలను ఏర్పాటు చేస్తామని వారు ఎంపీడీఓ రాజుకు తెలిపారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

మామిడికుదురు: వాడబోది మీడియం డ్రైన్ నుంచి వచ్చే ముంపు నీటితో పంట పొలాలు, కొబ్బరి తోటలు ముంపుబారిన పడుతున్నాయని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ రైతులు ఓఎన్‌జీసీ రెవెన్యూ అధికారి నారాయణరావుకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఓఎన్‌జీసీ నిర్మించిన రోడ్డు వల్ల ముంపు నీరు నిలిచిపోయి సుమారు 400 ఎకరాల్లో వరి, కొబ్బరి తోటలు దెబ్బతింటున్నాయని బాధితులు గతంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఓఎన్‌జీసీ అధికారులు రెవెన్యూ అధికారి నారాయణరావును పంపించారు. ఆయన స్థానికంగా ఉన్న సమస్యలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వారి సమస్య తెలుసుకున్నారు. వాడబోది మీడియం డ్రైన్ నుంచి ముంపు నీరు సక్రమంగా పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. తమకు ఓఎన్‌జీసీ పంట నష్టపరిహారం చెల్లిస్తోందని, దాని వల్ల తాత్కాలిక ఉపశమనం తప్ప సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. డ్రైన్‌ను ఆధునీకరిస్తామని గతంలో ఓయన్‌జీసీ అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాయపురెడ్డి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రంగారావు, వెంకన్నబాబు, కృష్ణ, సూరిబాబు తదితరులు ఉన్నారు.


అంతర్వేదిపాలెంలో పౌరహక్కుల దినోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం అధికారులు నిర్వహించారు. తహసీల్దారు ఎం.వెంకటేశ్వరరావు, ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ మేరకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ, సమాజంలో ఉండే ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించేలా పౌరహక్కులు ఉన్నాయన్నారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండేలా చూసుకోవాలని అన్నారు. మండల ఆర్ఐ వి.రామరాజు, మాజీ సర్పంచ్ నల్లి సురేంద్ర, నాయకులు గెడ్డం పేర్రాజు, పల్లపోతు కాంతారావు, తోటె జాన్ బాబు, మందపాటి సత్యనారాయణ, తోటె ప్రతాప్‌కుమార్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనివాసరావు సేవలు చిరస్మరణీయం

రాజోలు: ఎంపీపీ కేతా శ్రీనివాసరావు సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు, ఉద్యోగులు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీనివాసరావు సంతాప సభ నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మట్టా శైలజ, మండల ఉపాధ్యక్షులు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, తహసీల్దార్ సిహెచ్.భాస్కరరావు, తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి సిహెచ్.ఫణికిరణ్ తదితరులు ఎంపీపీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

విలేజ్ వెల్ఫేర్ ట్రస్టుకు విరాళాలు



రామేశ్వరంలో విజయ్ ప్రసాద్‌కు విరాళం ఇస్తున్న లక్ష్మీ నరసయ్య

సఖినేటిపల్లి: మండల పరిధిలోని రామేశ్వరం విలేజ్ వెల్ఫేర్ ట్రస్టుకు సోమవారం స్థానికులు విరాళాలు అందజేశారు. ఈ మేరకు విరాళాలను ట్రస్టు ఫౌండర్ సరెళ్ల విజయ్ ప్రసాద్‌కు వారు అందజేశారు. వీరిలో స్థానిక రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మత్తి లక్ష్మీ నరసయ్య రూ.15 వేలు, మరో దాత పాటబళ్ల సతీష్ రూ.20 వేలు అందజేసినట్టు విజయ్ ప్రసాద్ చెప్పారు. ట్రస్టు తరుపున వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

సీసీ కెమెరాల చోరీపై దర్యాప్తు

సఖినేటిపల్లి: అంతర్వేది బీచ్‌లో పబ్లిక్ భద్రతకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చోరీపై సఖినేటిపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అంతర్వేది మెరైన్ సీఐ నవీన్ నరసింహామూర్తి సూచనలతో మెరైన్ కానిస్టేబుల్ శేఖర్ చేసిన ఫిర్యాదు ఆధారంగా సివిల్ ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు ఈ దర్యాప్తు చేపట్టారు. సోమవారం వివరాలు మెరైన్ సీఐ వెల్లడించారు. ప్రజల భద్రత దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రోత్సాహంతో అంతర్వేది ఉత్సవాలకు ముందు మెరైన్ పోలీసులు 7 సీసీ కెమెరాలు, రెండు టవర్స్ తదితర వాటిని ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల రాత్రి సమయంలో సీసీ కెమెరాలు గుర్తు తెలియని వ్యక్తులు వాటిని చోరీ చేసినట్టు తమ సిబ్బంది గుర్తించారని తెలిపారు. ఈ మేరకు సివిల్ ఎస్సైకు సిబ్బంది ద్వారా ఫిర్యాదు చేసినట్టు మెరైన్ సీఐ పేర్కొన్నారు.

ఉద్యాన సాగుకు సహకారం

ఆలమూరు: ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగు చేసే సన్న, చిన్నకారు రైతులకు సహాయ సహకారాలను అందిస్తామని ఎంపీడీఓ ఏ రాజు, ఏపీఓ జి.అరుణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులు తమ పంట పొలాల్లో జామ, తైవాన్ జామ, గులాబి, మునగ, కొబ్బరి, కోకో తదితర పంటలు వేసేకోవచ్చునన్నారు. ఈ పంటలు వేసుకునే రైతులకు రెండేళ్ల పాటు ఉచితంగా మెయింటెనెన్స్ అందిస్తామన్నారు.